క్లుప్తంగా

మెరుగైన విద్యనందించేందుకు సీఎం చర్యలు



ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్యే వరప్రసాదరావు

మలికిపురం: రాష్ట్రంలో సీఎం జగన్ విద్యార్థులకు మెరుగైన విద్యనందించేందుకు చర్యలు తీసుకుంటున్నారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. బుధవారం మలికిపురం డిగ్రీ కళాశాల సెమినార్ హాల్‌లో పదో తరగతి ఉత్తీర్ణులకు సావిత్రిబాయి పూలే ప్రతిభా పురస్కారాలను ఎమ్మెల్యే అందజేశారు. బహుజన సమన్వయ సమాఖ్య ఆధ్వర్యాన రాజోలు నియోజకవర్గంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి ఫలితాల్లో 500 మార్కులు పైబడి సాధించిన విద్యార్థులకు పై పురస్కారాలను ఆయన ఇచ్చారు. సమాఖ్య అధ్యక్షుడు గెడ్డం తులసీ భాస్కరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి, రాజోలు ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, సమాఖ్య సభ్యులు, విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ఠ

అంబాజీపేట: ఇరుసుమండలో వేంచేసిన బాలత్రిపుర సుందరి సమేత ఆనంద్ రామేశ్వర స్వామి ఆలయంలో మేధా దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. వేదపండితుల పర్యవేక్షణలో సుంకర సూర్యనారాయణ–కుసుమాంబ దంపతుల కుమారులు వెంకటస్వామి నాయుడు, సీతారామదాసునాయుడు దంపతుల ఆధ్వర్యంలో మేధా దక్షిణామూర్తి ప్రత్యేక పూజలతో పాటు గణపతి హోమం, రుద్రాభిషేకాలు నిర్వహించారు. మేధా దక్షిణామూర్తి గురించి పలు అంశాలను గురువులు ఆకెళ్ల కనకాల శాస్త్రి భక్తులకు వివరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం దక్షిణామూర్తి విగ్రహాన్ని తయారుచేసిన శిల్పి కాతేరుకి చెందిన దంపతులను శాలువాతో సన్మానం చేశారు.


ఘనంగా గజమాల యాత్ర

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి కల్యాణం సందర్భంగా దేవస్థానం వ్యవస్థాపకుడు మొల్లేటి రామస్వామి, ఆదిలక్ష్మి దంపతుల మెడలో ఆవిష్కరించే గజమాల యాత్ర ఊరేగింపు బుధవారం ఘనంగా జరిగింది. మండల శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో రాజోలు మండలం తాటిపాక శెట్టిబలిజ సంఘం భవనం నుంచి ప్రారంభమైన యాత్ర మామిడికుదురు బస్టాండ్ కూడలి మీదుగా అప్పనపల్లి వరకు సాగింది. అప్పనపల్లి ఆలయం ప్రాంగణంలో ఉన్న రామస్వామి దంపతుల విగ్రహాలకు గజమాలను అలంకరించారు. శెట్టిబలిజ యువత బైక్ ర్యాలీగా గజమాల యాత్రలో పాల్గొన్నారు. యాత్రలో తాలూకా సంఘం అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్, మండల సంఘం అధ్యక్షుడు కాండ్రేగుల శ్రీనివాస్, గౌరవాధ్యక్షుడు వాసంశెట్టి శంకరరావు, కార్యదర్శి జోగి వెంకటరామకృష్ణ, కోశాధికారి పెచ్చెట్టి సత్యచంద్రరావు, సహ కార్యదర్శి కడలి నూకరాజు పాల్గొన్నారు.

పారదర్శకంగా పంట నమోదు చేయాలి

అంబాజీపేట: ఇటీవల వీచిన ఈదురుగాలులకు నేలకొరిగి నష్టపోయిన అరటి పంట వివరాలను పారదర్శకంగా నమోదు చేయాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. మాచవరం శివారు పోతాయిలంకలో వీహెచ్ఓల ఆధ్వర్యంలో ఈదురు గాలులకు నేలకొరిగిన అరటి తోటల నమోదు చేస్తున్న వివరాలను ఎంపీపీ వెంకటేశ్వరరావు బుధవారం పరిశీలించారు. ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో నేలకొరిగిన అరటి తోటల వివరాలను ఆయా గ్రామాల వీహెచ్ఓలచే నమోదు చేయించుకోవాలని రైతులకు తెలిపారు. పంట నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందేలా తగిన కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వీహెచ్ఓ కుమారి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ ప్రసాదరావు మృతి



వరప్రసాదరావు (ఫైల్)

అంబాజీపేట: కొర్లపాటివారిపాలెంకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ సర్పంచ్ కొర్లపాటి సుబ్రహ్మణ్య వరప్రసాదరావు (79) బుధవారం తెల్లవారుజామున కన్నుమూశారు. వరపరసాదరావు గత కొద్ది రోజులుగా అనారోగ్యంగా ఉండటంతో ఆయన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాదులోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆయన అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారని కుటుంబ సభ్యులు తెలిపారు. వరప్రసాదరావుకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన పెద్ద తనయుడు వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కొర్లపాటి కోటబాబును, వరప్రసాదరావు కుటుంబ సభ్యులను పలువురు పరామర్శించి మనోధైర్యం కల్పించారు. వరప్రసాదరావు మృతికి వైఎస్సార్ సీపీ, కాంగ్రెస్ నాయకులు, స్థానికులు సంతాపం వ్యక్తం చేశారు.

కల్యాణం.. కమనీయం

- వైభవంగా బాలాజీ తిరు కల్యాణోత్సవం
- ఆలయంలో భక్తుల కోలాహలం
- మార్మోగిన గోవిందనామ స్మరణ



గరుడ వాహనంపై స్వామివారి తిరువీధి ఉత్సవం



తిరు వీధి ఉత్సవంలో ఆకట్టుకున్న కేరళ నృత్యాలు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి వార్షిక దివ్య తిరు కల్యాణ మహోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి శుభ ముహూర్తాన శ్రీవారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులకు ఉభయ దేవేరులతో కొలువుదీరిన బాల బాలాజీ స్వామి దివ్య దర్శనం లభించింది. తిరు కల్యాణోత్సవాలు రెండో రోజు ఉదయం సుప్రభాత సేవతో మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ ఘనంగా ప్రారంభమయ్యాయి. దేవస్థానం ప్రధానార్చకుడు మద్దాలి తిరుమలశింగరాచార్యులు, త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి వారి శిష్య బృందం ఆధ్వర్యంలో శ్రీవారికి సహస్ర నామార్చన, బాల భోగ నివేదన, చతుస్థానార్చన, ధ్వజారోహణం జరిపించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఈఓ డి.శ్రీరామవరప్రసాదరావు పర్యవేక్షణలో కల్యాణం నిర్వహించారు.

సంతానం కోసం పూజలు

సంతానం లేక ఇబ్బంది పడుతున్న మహిళలకు బుధవారం ఉదయం ధ్వజారోహణం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామి వారి ప్రసాదాలు అందజేశారు. ఈ ప్రసాదాన్ని తినడం ద్వారా స్వామి కృపతో సంతాన యోగ్యం కలుగుతుందని భక్తుల విశ్వాసం. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు మహిళలు స్వామి వారి ప్రసాదాన్ని వరంగా స్వీకరించారు. ఆలయం వెనుక భాగంలో ఈ ప్రసాదాన్ని ఆరగించి తమ కోరిక సిద్ధించాలని స్వామి వారిని ప్రార్థించారు.

కనులపండువలా గ్రామోత్సవం

వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలు, భక్తుల గోవిందనామ స్మరణలు, బాణసంచా కాల్పుల నడుమ శ్రీ, భూ సమేతంగా బాలబాలాజీ స్వామిని పురవీధుల్లో గరుడ వాహనంపై ఊరేగిస్తూ నిర్వహించిన గ్రామోత్సవం కనులపండువలా సాగింది. భక్తులు, ఆలయ ఉద్యోగులు, సిబ్బంది గ్రామోత్సవంలో పాల్గొన్నారు. భక్తులు స్వామి, అమ్మవార్లకు ముడుపులు, మొక్కులు చెల్లించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారి ఆలయాన్ని పలు రకాల బెంగళూరు పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

ప్రత్యేక ఆకర్షణగా కోలాటం

బాల బాలాజీ స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన హరే శ్రీనివాస్ కోలాటం కార్యక్రమం ఆహుతులను ఆనంద పరవశుల్ని చేసింది. కల్యాణోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన కేరళ వాయిద్యాలు భక్తుల్ని తన్మయత్వంలో ముంచెత్తాయి. స్థానిక వాణీ మహిళా సత్సంగ మిత్ర బృందం సభ్యులు ఆలపించిన శ్రీలలితా విష్ణు సహస్రనామ పారాయణ, అరుణకుమారి భజన సమాజం, జీవీ రమణ వారితో ఆలపించిన భజన గీతాలు, కాజులూరి మహేంద్రకుమార్ బృందం వాయించిన బ్యాండ్ వాయిద్యాలు భక్తులను మంత్ర ముగ్ధుల్ని చేశాయి. సర్పంచ్ గెడ్డం మంగాలక్ష్మి, ఎంపీటీసీ బొంతు నీలిమ, పీఏసీఎస్ చైర్మన్ గెడ్డం కృష్ణమూర్తి, ధర్మకర్తలు చిట్టాల సత్తిబాబు, కొమ్ముల సూరిబాబు, గూటం శ్రీను, పెదమల్లు ఉషారాణి, బత్తుల గంగారత్నం, మానుపాటి సూర్యకుమారి, బొరుసు పార్వతీదుర్గాభవాని, గుత్తుల భానుప్రకాష్ పాల్గొన్నారు.

అన్ని వర్గాలకూ సంక్షేమ ఫలాలు



పాశర్లపూడిలో గడప గడపకూ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు అన్ని వర్గాలకు సక్రమంగా అందుతున్నాయని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం పాశర్లపూడిలో జరిగింది. ఎమ్మెల్యే చిట్టిబాబు ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలు అందజేశారు. చిట్టిబాబు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో అన్ని వర్గాలకు మేలు చేకూరే విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఎన్నికల హామీలను నెరవేర్చడంలో ఎక్కడా మాట తప్పలేదు. మడమ తిప్పలేదని పేర్కొన్నారు. అందుకే ప్రజలు జగన్‌కు అండగా నిలుస్తున్నారన్నారు. జగన్ పాలనకు ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారని చిట్టిబాబు పేర్కొన్నారు. మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, ఎంపీటీసీ అంకాని వీరాంజనేయులు, పీఏసీఎస్ చైర్మన్ యావీవీ సత్యనారాయణ, గ్రామ శాఖ అధ్యక్షుడు చిక్కం బుజ్జిబాబు, మాజీ సర్పంచ్‌లు మొల్లేటి త్రిమూర్తులు, కొనుకు నాగరాజు, పార్టీ నాయకులు తోరం సూర్యభాస్కర్, కొండేటి స్టాలిన్‌బాబు, వాసంశెట్టి రామకృష్ణ, వాకపల్లి వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరేశ్వరుని కల్యాణం

పి.గన్నవరం: కుందాలపల్లిలో వేంచేసిన భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి వారి కల్యాణం బుధవారం రాత్రి కనులపండువగా జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ పినిశెట్టి శ్రీనివాసులు దంపతుల ఆధ్వర్యంలో అర్చకస్వామి కొత్తలంక కామేశ్వరరావు నేతృత్వంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు పెద్ద ఎత్తున అన్న సమారాధన చేశారు.

ఆలమూరు: మండలంలోని సంధిపూడిలో వేంచేసియున్న పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలు భక్తులకు విచ్చేసి స్వామికి తమ మొక్కులను తీర్చుకున్నారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

వైభవంగా స్వామి వార్ల కల్యాణం

మామిడికుదురు: గోగన్నమఠంలో కొలువుదీరిన చతుర్భుజ భద్రాద్రి సీతారామస్వామి, శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి వార్ల దివ్య తిరు కల్యాణం వైభవంగా జరిగింది. స్వామి వార్ల అష్టమ వార్షికోత్సవంలో భాగంగా ఉదయం 8.57 గంటలకు పలువురు భక్త దంపతులు స్వామి వార్ల కల్యాణ క్రతువులో పాల్గొన్నారు. స్వామి వార్ల కల్యాణం అనంతరం భక్తులకు భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

ఆలమూరు: గ్రామంలో వేంచేసియున్న శ్రీ. భూ సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాలు వైభవంగా జరిగాయి. గ్రామానికి చెందిన రెడ్డి వెంకట్రావు కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో ఆలయ పురోహితులు హరిప్రసాద్ ఆచార్యుల పర్యవేక్షణలో వేద పండితులు దేవతామూర్తుల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. చుండ్రు వెంకట శివప్రసాద్-లావణ్య దంపతులు పీటలపై కూర్చుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వేణుగోపాలస్వామి ఆలయానికి శంకుస్థాపన



గోపాలపురంలో ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి దంపతులు

రావులపాలెం: మండలంలోని గోపాలపురంలో శిథిలావస్థకు చేరిన పురాతన వేణుగోపాలస్వామి దేవాలయం పునర్నిర్మాణానికి బుధవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి శంకుస్థాపన చేశారు. శంకుస్థాపనలో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి సతీసమేతంగా పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీజీఎఫ్ నిధులను మాచింగ్ గ్రాంట్ రూ.50 లక్షలు మంజూరు చేయించి ఈ ఆలయం నిర్మిస్తున్నామన్నారు. అలాగే నియోజకవర్గంలో సీజీఎఫ్ గ్రాంట్ నుంచి రూ.75 లక్షలతో గోపాలపురం ఉమా బలేశ్వర స్వామి దేవాలయం, రూ.50 లక్షలతో వేణుగోపాలస్వామి దేవాలయాల పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయించామన్నారు. అలాగే చింతలూరు నూకాంబిక అమ్మవారి దేవాలయం పునర్నిర్మాణానికి రూ.కోటి సీజీఎఫ్ మాచింగ్ గ్రాంట్, నియోజకవర్గంలో శిథిలావస్థకు చేరిన ఇతర దేవాలయాల పునర్నిర్మాణానికి, పలు రామాలయాల అభివృద్ధికి టీటీడీ నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపామన్నారు. అనంతరం మండలంలోని దేవరపల్లిలో తిమ్మప్పదొడ్డిలో నిర్మించనున్న ఎంపీపీ పాఠశాల భవనానికి, కొత్తపాలెంలో నిర్మించనున్న రామాలయానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో సర్పంచులు సబ్బితి మోహనరావు, డి.అర్జునరావు, చిర్ల రామచంద్రారెడ్డి, కొవ్వూరి బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వర స్వామి క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి, పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవాలు బుధవారం కన్నులపండువగా జరిగాయి. ఆయా ఆలయాల్లో స్వామి కల్యాణోత్సవాలను వేదపండితులు, అర్చకులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం స్వామికి పలు పూజలను నిర్వహించారు. ఏర్పాట్లను వాడపల్లి ఆలయ చైర్మన్, ఈవో, ర్యాలి ఆలయ ఈఓల ఆధ్వర్యంలో సిబ్బంది, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే తాడిపూడిలో కనకదుర్గాదేవి ఆలయ ప్రతిష్ఠ కనులపండువగా జరిగింది. ఈ మహోత్సవానికి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవార్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా సిరిబంగారమ్మ విగ్రహ ప్రతిష్ఠ

కొత్తపేట: స్థానిక కొప్పిశెట్టివారి వీధిలో నూతనంగా నిర్మించిన సిరిబంగారమ్మ అమ్మవారి ఆలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయనకు గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు ఘనస్వాగతం పలికారు. అనంతరం జగ్గిరెడ్డిని కమిటీ సభ్యులు పూలమాలలు, శాలువాతో సత్కరించారు. జగ్గిరెడ్డి వెంట ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, ఎం.వీరభద్రరావు, ఎంపీటీసీ విళ్ల వీర్రాజు, జి.ప్రవీణ్‌కుమార్, రాయుడు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన



సచివాలయ భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రాధాన్యం కల్పిస్తుందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని నార్కెడ్‌మిల్లిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. నార్కెడ్‌మిల్లి ఏటుగట్టు నుంచి తాడిపూడి వరకు రోడ్డు నిర్మాణ పనులు రూ.1.80 కోట్లతో శంకుస్థాపన చేశారు. నార్కెడ్‌మిల్లి సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. 18 మంది వలంటీర్లను సన్మానించారు. సర్పంచ్ పాలా నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేయడం తగదన్నారు. ఏ ప్రభుత్వంలో ఎంత లబ్ధి పొందారో ప్రజలకు తెలుసనీ, ప్రతిసారి బటన్ నొక్కి వారి ఖాతాలకు సంక్షేమ పథకాల సొమ్మును అందించిన సీఎం జగన్ ప్రభుత్వానికి విజ్ఞులైన ప్రజలు సమయం వచ్చినప్పుడు ఓటుతో తమ కృతజ్ఞతలు తెలుపుతారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కనుమూరి శ్రీనివాస రాజు, పార్టీ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, డీసీఎంఎస్ చైర్మన్ సాకా మణికుమారి, నేతలు గారపాటి గంగారామ్‌చౌదరి, చిలువూరి బాబిరాజు, ఎంపీపీ మార్గాని గంగాధరం, జెడ్పీటీసీ బోణం సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సౌకర్యం కల్పించాలి

కొత్తపేట: స్థానిక కమ్మిరెడ్డిపాలెం ప్రాంతానికి డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని ఆ ప్రాంత మహిళలు అధికారులకు, ప్రజాప్రతినిదులకు విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు ఆ ప్రాంతానికి చెందిన సుమారు 30 మంది మహిళలు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏఓ కృష్ణారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. సుమారు 50 ఏళ్లుగా ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్నామని, ఎప్పుడూ మురికి నీరు, వర్షం నీరు సమస్య లేదని, అయితే సుమారు ఏడాదిగా మురికినీరు, వర్షంనీరు పోయే మార్గం లేకుండా పోయిందని వాపోయారు. తాళ్లమ్మ గుడి వీధిలో ఈ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. ఈ సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

హత్యాయత్నం కేసులో నలుగురి అరెస్ట్

ఆలమూరు: మండలంలోని చెముడులంకలో పాలమర్తి వీర అంజికుమార్‌పై జరిగిన హత్యాయత్నం కేసులో నలుగురు నిందితుల అరెస్ట్ జరిగింది. స్థానిక ఎస్సై ఎస్.శివప్రసాద్ కథనం ప్రకారం చొప్పెల్లకు చెందిన అంజికుమార్‌ను ఈనెల 25న రాత్రి పదిగంటలకు గ్రామానికి చెందిన మంగిన సాయి, దొండపాటి తేజ, వంగా సాయి, మెర్ల కిరణ్ బ్లేడ్‌తో దాడిచేసి తీవ్రంగా గాయపర్చారు. దీనిపై స్థానిక పీఎస్‌లో కేసు నమోదు కాగా కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ, రావులపాలెం సీఐ ఎస్.రజనీకుమార్ ఆదేశాలతో గాలింపు చర్యలు చేపట్టారు.దీంతో మడికి మార్కెట్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురిని అరెస్ట్ చేశారు. వీరికి స్థానిక జూనియర్ సివిల్ జడ్జి నిందితులకు 15 రోజుల రిమాండ్ విధించారు.

రెండు బైక్‌ల చోరీ

అంబాజీపేట: స్థానిక మార్కెట్ యార్డు వద్ద, పశువుల సంతలోను బుధవారం పార్కింగ్ చేసిన రెండు బైక్‌లు చోరీకి గురయ్యాయి. సఖినేటిపల్లి మండలం శంకరగుప్తం గ్రామానికి చెందిన ఆచంట శ్రీనివాసరావు తన బైక్‌ను మార్కెట్ యార్డు బయట ఉంచి అరటిగెలలు కొనుగోలు చేసేందుకు వెళ్లాడు. అరగంట తరువాత తిరిగి వచ్చేసరికి బైక్ కనిపించలేదు. అలాగే రామరాజులంకు చెందిన వాతాడి మసేనురావు తన బైక్‌ను పశువుల మార్కెట్ వద్ద ఉంచి పనులు చూసుకుని వచ్చే ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎ.చైతన్యకుమార్ తెలిపారు.

పి.గన్నవరంలో మరొకటి..

పి.గన్నవరం: స్థానిక సంత మార్కెట్లో బైక్ చోరీ చేసిన ఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. సఖినేటిపల్లి మండలం అంతర్వేదిపాలేనికి చెందిన భీమనాథం నారాయణమూర్తి మే 23న బైక్‌పై రావులపాలెం వెళ్లారు. తిరుగుక్రమంలో సంతమార్కెట్ బయట బైక్‌ను పార్కు చేసి, లోపలికి వెళ్లారు. తిరిగివచ్చే సరికి బైక్ లేదు. దీంతో ఆయన పరిసర ప్రాంతాలు గాలించినప్పటికీ ఫలితం లేకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

అంబాజీపేట: వివాహితను ఓ యువకుడు పెళ్లి చేసుకోవాలని వేధిస్తున్న నేపథ్యంలో ఆ వివాహిత మనస్థాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గంగలకుర్రు నెల్లివారిపేటకు చెందిన ఓ మహిళకు ఏడేళ్ల క్రితం అయినవిల్లి మండలం నేదునూరుకు చెందిన వ్యక్తితో వివాహం జరిగింది. వారికి ఇరువురు పిల్లలు. పుట్టింటికి వచ్చిన వివాహితను అదే పేటకు చెందిన నెల్లి అనిల్ తరచూ వెంటపడి పెళ్లి చేసుకోవాలని వేధిస్తుండటంతో మనస్థాపానికి గురై మే 29 రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందన్నారు. దీంతో స్థానికులు ఆమెను వైద్య చికిత్స నిమిత్తం అమలాపురం ఆస్పత్రికి తరలించారు. వివాహిత ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎ.చైతన్యకుమార్ తెలిపారు.

దేశానికే ఆదర్శంగా వలంటీర్ వ్యవస్థ



గుడిమూలలో వలంటీర్‌ను సత్కరిస్తున్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ

సఖినేటిపల్లి: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తెచ్చిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎంపీపీ వీరా మల్లిబాబు అన్నారు. బుధవారం గుడిమూల పంచాయతీ వద్ద సర్పంచ్ దెందుకూరి శ్రీహరిరాజు ఆధ్వర్యాన వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా అవార్డులు పొందిన వారిని ఎంపీపీ, వైస్ ఎంపీపీ రుద్రరాజు చిన రాజా సత్కరించారు. ఎంపీడీవో జి.భీమారావు, ఉపసర్పంచ్ రోజామణి, కార్యదర్శి గంగరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మలికిపురం: మండలంలోని మట్టపర్రులో బుధవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. అవార్డులు అందుకున్న వారిని ప్రజాప్రతినిధులు, ప్రముఖులు ఘనంగా సత్కరించారు. జగనన్న సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందేలా కృషి చేస్తున్నారని పార్టీ మండల అధ్యక్షుడు అడబాల బ్రహ్మాజీ అన్నారు. సర్పంచ్ కడలి దుర్గాదేవి, ఎంపీటీసీ నల్లి అంజలీదేవి, మండల జేఏసీ కన్వీనర్ చింతా రాజబాబు, ఎంఏఏ చైర్మన్ నల్లి శివకుమార్, రాపాక సూర్య, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బండ్రెడ్డి శ్రీను, కడలి నాగేశ్వరరావు, గృహ కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

రాజోలు: వలంటీర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమని పొదలాడ సర్పంచ్ కడలి సత్యనారాయణ అన్నారు. బుధవారం పొదలాడ గ్రామ సచివాలయం వద్ద వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు, సోంపల్లి సర్పంచ్ కట్టా శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతా ప్రసాద్‌లు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. సీఎం జగన్ పాలనలో సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు పంపిణీ చేయడంలో వలంటీర్లు కీలకంగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వలంటీర్లు వివరించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి కృష్ణ, ఎంపీటీసీ శిరిగినీడి వెంకటేశ్వరరావు, గ్రామశాఖ అధ్యక్షుడు లిఖితపూడి బుజ్జి, వైఎస్సార్ సీపీ నాయకులు కంబాల చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లి: ఎక్కడా అవినీతికి తావు లేకుండా వలంటీర్లతోనే ప్రభుత్వ పథకాలు అర్హులైన పేదలకు అందుతున్నాయని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. బుధవారం కె.జగన్నాథపురం సచివాలయాల పరిధిలోని వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా వలంటీర్లను ఎమ్మెల్యే చిట్టిబాబు సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మేడిశెట్టి ఉషారాణి, ఎంపీటీసీ జలగం హేమలత, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు మేడిశెట్టి శ్రీను తదితరులు ఉన్నారు.

నేడు జిల్లా స్థాయిలో వైఎస్సార్ రైతు భరోసా కార్యక్రమం

కొత్తపేట: వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ పథకంలో రైతుల ఖరీఫ్ పంట పెట్టుబడి సాయం పంపిణీని రావులపాలెంలో నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జ్ జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) కె.నాగేశ్వరరావు, ఆ శాఖ స్థానిక సబ్ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీఏ) ఎం.వెంకట రామారావు తెలిపారు. ఆర్‌బీకే, పీఎంకే ఐదో సంవత్సరం తొలివిడత నిధులను గురువారం ఉదయం 9 గంటలకు సీఎం జగన్ కర్నూలు జిల్లా పత్తికొండలో బటన్ నొక్కి విడుదల చేస్తుండగా బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు సంబంధించిన కార్యక్రమాన్ని రావులపాలెంలో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో వెదిరేశ్వరం రోడ్డులోని మల్లిడి కనికిరెడ్డి కన్వెన్షన్ హాలులో ఏర్పాటు చేస్తున్నట్టు డీఏఓ నాగేశ్వరరావు, ఏడీఏ వెంకట రామారావు తెలిపారు. ఈ సభ ఏర్పాట్లను బుధవారం సాయంత్రం వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మంత్రులు పినిపే విశ్వరూప్, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎంపీ చింతా అనురాధ, జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా, జేసీ ధ్యానచంద్ర, జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల ప్రతినిధులు హాజరవుతారన్నారు.

పాలవెల్లువతో పాడిరైతులకు మేలు

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో ప్రవేశపెడుతున్న పాలవెల్లువ కార్యక్రమం పాడిరైతులకు కలిగే మేలును వివరించాలని ఎంపీడీఓ కె.జాన్‌లింకన్, తహసీల్దార్ ఐపి.శెట్టి, కపిలేశ్వరపురం సీడీపీఓ అధికారి గజలక్ష్మి తెలిపారు. ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం పాలవెల్లువ కార్యక్రమంపై పంచాయతీ కార్యదర్శులు, యానిమేటర్లు, పశుసంవర్ధక, వెలుగు, ఎన్ఆర్ఈఎస్ అధికారులతో అవగాహన సదస్సు జరిగింది. తొలుత ఆయా శాఖల సిబ్బంది గ్రామాల్లో పర్యటించి పాడి రైతులను గుర్తించాలన్నారు. వారి ద్వారా పాలను సేకరించి ప్రభుత్వం ద్వారా నిర్వహిస్తున్న పాలవెల్లువ పాల కేంద్రాలకు విక్రయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈఓపీఆర్డీ పీఆర్‌సీరాజ్‌కుమార్, ఏపీఎం ఎం.విశ్వనాథ్, ఏపీఓ కామత్, సూపర్‌వైజర్లు నాగలక్ష్మి, బి.వరలక్ష్మి, వై.అరుంధతి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదకు సాయం

సఖినేటిపల్లి: స్థానిక రత్నాలపేటకు చెందిన రత్నా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన బుధవారం స్థానిక బాడిరేవు వంతెన ఏరియాకు చెందిన నిరుపేద ఆకుల బేబీ వెంకటలక్ష్మికి రూ.10,000 ఆర్థిక సాయం పంపిణీ చేశారు. రత్నాలపేటకు చెందిన దాత, ట్రస్ట్ ప్రతినిధి గొల్ల విజయ్‌ప్రకాష్ పై మొత్తాన్ని సమకూర్చారు. ఈ మేరకు దీనిని వైస్ ఎంపీపీ రాపాక దీవెన కుమారి, పార్టీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్‌లు ఆమెకు అందజేశారు. పరిషత్ కో ఆప్షన్ మెంబర్ బళ్ల నోబుల్ ప్రభాకర్, పార్టీ నాయకుడు రాపాక సూర్యప్రకాష్, స్థానికులు గెద్దం డేవిడ్, తాడి సహదేవ్, నల్లి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.